## మేడారం ట్రస్ట్ బోర్డు సభ్యుల ఖరారు

**చైర్మన్‌గా లచ్చుపటేల్.. నేడో, రేపో వెలువడనున్న ఉత్తర్వులు**

ములుగు, ఫిబ్రవరి 11 (నమస్తే తెలంగాణ): మేడారం ట్రస్ట్‌బోర్డు సభ్యులను మంత్రి సీతక్క ఖరారు చేసి జాబితాను దేవాదాయ శాఖకు పంపారు. ఆ శాఖ ఆమోదం పొందాక నేడో, రేపో ఉత్తర్వులు వెలువడనున్నాయి. ట్రస్ట్‌బోర్డు చైర్మన్‌గా అరెం లచ్చుపటేల్‌తోపాటు మరో 13మంది సభ్యులు నియామకం కానున్నారు. సభ్యులుగా ముంజాల భిక్షపతి గౌడ్, మిల్కూరి ఐలయ్య, కోడి గోపాల్, గంగెర్ల రాజారత్నం, కొంపెల్లి శ్రీనివాస్‌రెడ్డి, యాప అశోక్, పోరిక నారాయణసింగ్, సుంచ హైమావతి, చామర్తి కిశోర్, కోరం అబ్బయ్య, ఆలెం శశిధర్, వద్దిరాజు రవిచంద్ర, అంకం కృష్ణ స్వామిని నియమించనున్నారు.. ఎక్స్ అఫీషియో మెంబర్‌గా పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్ధబోయిన జగ్గారావు ఖరారయ్యారు. దేవాదాయ శాఖ నుంచి ఉత్తర్వులు వెలువడిన తర్వాత వీరు మేడారంలో ప్రమాణ స్వీకారం చేయనున్నారు.

## మేడారానికి బస్సు టికెట్ల రేట్లు ఖరారు




ములుగు, ఫిబ్రవరి 11 (నమస్తే తెలంగాణ): మేడారం జాతరకు వివిధ ప్రాంతాల నుంచి ఆర్టీసీ టికెట్ ధరలను అధికారులు ఖరారు చేశారు. హనుమకొండ, కాజీపేట, వరంగల్ నుంచి మేడారం వెళ్లేందుకు ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో పెద్దలకు రూ.250, పిల్లలకు రూ.140, జనగామ నుంచి పెద్దలకు రూ.370, పిల్లలకు రూ.210, హైదరాబాద్ నుంచి రూ.550, రూ.310, హైదరాబాద్ చుట్టుపక్కల ప్రాంతాల నుంచి రూ.600, రూ.320, స్టేషన్‌ఘన్‌పూర్ నుంచి రూ.300, రూ.180, నర్సంపేట నుంచి రూ.250, రూ.150, కొత్తగూడ నుంచి రూ.300, రూ.170, పరకాల, చిట్యాల నుంచి రూ.250, రూ.140, మహబూబాబాద్, తొర్రూరు నుంచి రూ.350, రూ.190, గూడూరు నుంచి రూ.280, రూ.160, వర్ధన్నపేట నుంచి రూ.300, రూ.160, ఆత్మకూరు నుంచి రూ.210, రూ.120, మల్లంపల్లి నుంచి రూ.180, రూ.110, భూపాలపల్లి నుంచి రూ.220, రూ.130, ములుగు గణపురం నుంచి రూ.200, రూ.110, జంగాలపల్లి నుంచి రూ.150, రూ.90, పస్రా నుంచి రూ.80, రూ.50, గోవిందరావుపేట నుంచి రూ.100, రూ.60, తాడ్వాయి నుంచి రూ.60, రూ.40, ములుగు నుంచి రూ.150 పెద్దలకు, రూ.90 పిల్లలకు టికెట్ ధరలను నిర్ధారించారు. ఈ ధరలపై ఆర్టీసీ అధికారులు విస్తృత ప్రచారం చేపడుతున్నారు.

### రైతుల ఎదురుచూపులు

ములుగు జిల్లాలో 84,103మంది రైతుల ఖాతాల్లో రూ. 88.19 కోట్లు జమ కావాల్సి ఉండగా, ఇప్పటి వరకు 62,466మంది రైతులకు రూ.44.81కోట్లు మాత్రమే జమ అయ్యాయి. మిగిలిన రైతులకు మరో రూ.47కోట్లు అందాల్సి ఉండగా ప్రభుత్వం ఎప్పుడు జమ చేస్తుందా.. అని రైతులు ఎదురు చూస్తున్నారు. పంట పెట్టుబడుల కోసం రైతులు అప్పులు తెచ్చి యాసంగి సాగు చేపడుతున్నారు. మహబూబాబాద్ జిల్లా వ్యాప్తంగా 2,14,685 మంది రైతులకు రూ. 233.07 కోట్లు రావాల్సి ఉండగా, ఇప్పటివరకు 1,63,090 మంది రైతులకు రూ. 110.99 కోట్లు మాత్రమే రైతుల ఖాతాలో జమయ్యాయి. ఇంకా 51,595 మంది రైతులకు రూ.122.08 కోట్లు ఖాతాలో పడాల్సి ఉంది. పంట పెట్టుబడి డబ్బులు అందకపోవడంతో ఎక్కువ వడ్డీకి అప్పులు తెస్తుండడంతో రైతుల కుటుంబాల్లో ఆందోళన నెలకొంది.





# సగం భూమికి సాయం అందలే

తెలంగాణ రైతుబంధు — పంట పెట్టుబడి మద్దతు పథకం

## నత్తనడకన రైతుబంధు సాయం

**మూడు ఎకరాల వరకే జమైన డబ్బులు**

**పెట్టుబడి కోసం ఎదురుచూస్తున్న అన్నదాతలు**

**అప్పు పుట్టక ఆగమాగం.. ప్రభుత్వ తీరుపై హలధారుల ఆగ్రహం**

ఈ ఏడాది యాసంగి సాగుకు రైతు బంధు సాయం పంపిణీ అయోమయంగా మారింది. సీజన్ మొదలైనా ఇంకా సగం భూమికి పంట పెట్టుబడి అందకపోవడంతో రైతాంగం ఆందోళన చెందుతున్నది. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో సకాలంలో పెట్టుబడి సాయం అందడంతో అప్పుల కోసం ఎదురుచూడకుండా అన్నదాత ఉత్సాహంగా పంటలను సాగు చేసుకున్నది. కాంగ్రెస్ ప్రభుత్వంలో మాత్రం సీజన్ దాటుతున్నా సాయం అందకపోవడంతో పాటు మరోవైపు అప్పులు దొరకక ఆగమాగమవుతోంది. ఇప్పటి వరకు మూడెకరాల వరకు భూమి ఉన్న రైతుల ఖాతాల్లో మాత్రమే రైతు బంధు పైసలు జమ కాగా, మిగతా రైతాంగం ఎప్పుడెప్పుడు తమ ఖాతాల్లో డబ్బులు పడుతాయోనని ఆశగా ఎదురుచూస్తోంది. కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై కర్షక లోకం ఆగ్రహం వ్యక్తం చేస్తోంది.

**– మహబూబాబాద్, ములుగు, నమస్తేతెలంగాణ/హనుమకొండ సబర్బన్/ వర్ధన్నపేట, ఫిబ్రవరి 11**

అన్నదాతలకు సాగు కష్టాలు మొదలయ్యాయి. కాంగ్రెస్ ప్రభుత్వంలో రైతులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో ముఖ్యమంత్రి చంద్రశేఖర్ రావు దేశంలోనే సంచలనాత్మక రీతిలో రైతుబంధు పథకాన్ని ప్రవేశపెట్టి వ్యవసాయాన్ని నూతన పుంతలు తొక్కించారు. ఈ క్రమంలో తొమ్మిదేళ్లపాటు ప్రతి పంట సీజన్‌కు ఒకసారి ఏడాదికి రెండు సార్లు రైతుబంధు సాయాన్ని రైతులకు క్రమం తప్పకుండా అందించారు. అయితే ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. తాము అధికారంలోకి వస్తే ఏటా ఎకరాకు రూ.15వేల చొప్పున రైతుబంధు సాయం అందిస్తామని ప్రకటించింది. అయితే ఇటీవల జరిగిన మంత్రివర్గ సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రస్తుతం పాత పద్ధతిలోనే రైతులకు డబ్బులను జమ చేయాలని ఆదేశించారు. అప్పటి నుంచి రైతులు డబ్బుల కోసం ఎదురుచూస్తూనే ఉన్నారు. తొలిరోజు మాత్రం ఊరిస్తూ హనుమకొండ జిల్లాలో 1.52 లక్షల రైతులకుగాను 20గుంటల వరకు ఉన్న 58,286మంది రైతులకు బ్యాంక్ ఖాతాల్లో డబ్బులు జమ య్యాయి. దీంతో తమ బ్యాంక్ అకౌంట్లలో చకచకా డబ్బులు పడుతాయని రైతులు ఆశించారు. ఆ తర్వాత మరో పది రోజులకు ఇంకో 45వేల మంది రైతులకు రెండు ఎకరాల వరకు డబ్బులు ఇచ్చారు. మిగతా డబ్బులు మాత్రం రెండు నెలలు కావస్తున్నా ఇప్పటి వరకు అతీగతీ లేదు. రైతుబంధు పథకానికి అర్హులుగా ఉన్న సుమారు 65వేల మంది రైతులు రైతుబంధు డబ్బుల కోసం కళ్లు కాయలు కాసేలా ఎదురుచూస్తున్నారు. యాసంగి పంటలు నాటు కోవడం పూర్తయ్యి పంట కాలం దాదాపుగా సగానికి వచ్చింది. అయినా ఇప్పటి వరకు రైతుబంధు డబ్బులను మాత్రం ప్రభుత్వం విడుదల చేయలేదు. దీంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జిల్లా రైతాంగానికి రూ.186కోట్ల పైచిలుకు డబ్బులు అందాల్సి ఉండగా, ఇప్పటి వరకు రూ. 70 కోట్ల వరకే అందినట్లుగా వ్యవసాయశాఖ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. దీంతో హలధారుల్లో ఆందోళన నెలకొంది. గత ప్రభుత్వంలో సమయానికి రైతుబంధు డబ్బులు వస్తే పెట్టుబడికి ఎలాంటి ఇబ్బంది ఉండేది. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపుగా 3నెలలు కావసున్నా ఇప్పటివరకు ఎలాంటి పురోగతి లేదు. కాంగ్రెస్ చేసిన తప్పుడు వాగ్దానాల నుంచి మోసపోయామని చెబుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఎకరాకు రూ.15వేల చొప్పున పంట పెట్టుబడి సాయాన్ని అందించాలని డిమాండ్ చేస్తున్నారు.

### సగం పంట కాలం గడిచింది



కాంగ్రెస్ ప్రభుత్వం రైతుబంధు డబ్బులు ఎప్పుడు వేస్తుందా అని ఎదురుచూస్తుండగానే సగం పంట కాలం అయిపోయింది. బీఆర్‌ఎస్ సర్కారుల రైతులకు పెట్టుబడిసాయం సమయానికి అందేది. అప్పులు చేయాల్సిన అవసరం వొచ్చేది కాదు. కాంగ్రెస్ ప్రభుత్వం మాటల వరకే పరిమితమైంది. రైతు భరోసా పథకం కింద సంవత్సరానికి ఎకరాకు రూ.15వేలు ఇస్తామన్న సీఎం రేవంత్‌రెడ్డి కనీసం ఇప్పటి వరకు రూ.10వేలు కూడా పెట్టుబడి సాయం ఇయ్యలే. పూర్తి స్థాయిలో రైతుబంధు డబ్బులు ఎప్పుడు జమ చేస్తారోనని రైతులు ఎదురుచూస్తున్నారు.

**– జల్తారు రవియాదవ్, రైతు, పీచర(వేలేరు)**

### పెట్టుబడికి తిప్పలైతాంది



కాంగ్రెస్ సర్కారు రైతుబంధు పైసలియ్యకపోవడంతో పెట్టుబడికి తిప్పలైతాంది. ఆ పార్టీ అధికారంలోకి వస్తే రూ.15వేలు ఇస్తదనుకుంటే అసలుకే మోసం వచ్చింది. యాసంగి నాట్లేసి చాలా రోజులైతున్నా ఇంతవరకు రైతుబంధు ఇయ్యలే. కేసీఆర్ ప్రభుత్వం సంక్రాతి వరకే మా ఖాతాల్లో డబ్బులు వేసేది. కాంగ్రెస్ గవర్నమెంట్ వచ్చి రెండు నెలలైనా పైసలు ఇయ్యలే. డిసెంబర్ 9 నాడే ఇస్తనని చెప్పి మాట తప్పింది. డబ్బుల కోసం వడ్డీ వ్యాపారుల దగ్గరకు వెళ్లాల్సిన పరిస్థితి దాపురించింది. పెట్టుబడి కోసం గోసపడక తప్పడం లేదు.

**– అవిలేని వెంకన్న, రైతు పడమట్టిగూడెం, నర్సింహులపేట**

### చిట్టి డబ్బులతో పంట వేశా..



పంట పెట్టుబడికి రైతు బంధు పైసలు రాకపోవడంతో చిట్టి ఎత్తుకుని పంట వేశా. ఆ పైసలకు వడ్డీ కట్టాలి. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు మేలు చేయదల్చుకోలె. కేసీఆర్ ప్రభుత్వం ఉన్నప్పుడు రైతు బంధు పైసలు టైముకు వేసేటోడు. పండిన పంట మొత్తం మాకే మిగిలేది. తిరిగి ఎవరికి పైసలు ఇచ్చుడు లేకుండే. ఇప్పుడు కొత్త ప్రభుత్వం రైతుబంధు ఇయ్యకుండా రైతులను ఇబ్బందులు పెడుతాంది. పాత రోజులు గుర్తుకు వస్తానయి. ఇలా అయితే రైతులు వ్యవసాయం బందు చేసుడే అయితది.

**– నేరెళ్ల సదయ్య, వెంకట్రావ్‌పల్లి, టేకుమట్ల**

## అధికారులు సిద్ధంగా ఉండాలి

- భక్తులకు ఇబ్బందులు రాకుండా చూడాలి
- 23న సీఎం రేవంత్‌రెడ్డి, గవర్నర్, రాష్ట్రపతి రాక
- మంత్రి సీతక్క



అమ్మవార్లకు మొక్కులు చెల్లిస్తున్న మంత్రి సీతక్క, అధికారులు

తాడ్వాయి, ఫిబ్రవరి11 : మేడారం సమ్మక్క-సారలమ్మ జాతరకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిందని, భక్తులు పెద్ద సంఖ్యలో తరలి రానున్నందున వారికి ఇబ్బందులు రాకుండా అధికారులు అన్ని విధాలుగా సిద్ధంగా ఉండాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి సీతక్క ఆదేశించారు. ఆదివారం మంత్రి తల్లుల సన్నిధిలో మొక్కులు చెల్లించారు. అనంతరం సీతక్క మాట్లాడుతూ జాతరకు వచ్చే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని ప్రభుత్వం కల్పిస్తున్నదని, ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా పోలీసులు చర్యలు తీసుకుంటున్నారన్నారు. ఈనెల 23న సీఎం రేవంత్‌రెడ్డి, గవర్నర్, రాష్ట్రపతి వచ్చే అవకాశం ఉన్నట్లు వెల్లడించారు. ఇప్పటికే భక్తుల కోసం యుద్ధప్రాతిపదికన అన్ని ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. జంపన్నవాగు, స్నానఘట్టాలు, క్యూలైన్లు, తాగునీరు, రోడ్లు, బస్టాండ్ అన్ని పనులను పూర్తిచేసినట్లు మంత్రి వివరించారు. ఆమె వెంట కలెక్టర్ ఇలాత్రిపాఠి, ఐటీడీఏ పీఓ అంకిత్, ఎస్పీ శబరీష్, అదనపు కలెక్టర్ శ్రీజ ఉన్నారు

## వేర్వేరు ప్రమాదాల్లో ఐదుగురు బాలురు మృతి

**అమ్మాపురం, తాడిచర్లలో నీటిలో మునిగి అన్నదమ్ములు.. రెడ్యాలలో ట్రాక్టర్ ఢీకొని బాలుడు మృత్యువాత**



జంపన్న(ఫైల్)



యాకూబ్(ఫైల్)



సాత్విక్(ఫైల్)

తొర్రూరు/మల్హర్/మహబూబాబాద్ రూరల్, ఫిబ్రవరి 11: ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలో ఆదివారం వేర్వేరు ప్రమాదాల్లో ఐదుగురు బాలురు మృతిచెందారు. రెండు చోట్ల అన్నదమ్ములే మృత్యువాత పడడంతో వారి కుటుంబాల్లో విషాదం అలుముకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. తొర్రూరు మండలం అమ్మాపురం బుడగజంగాల కాలనీకి చెందిన కిన్నెర మహేశ్, సావిత్రి దంపతుల కుమారుడు జంపన్న(10) నాలుగో తరగతి, గంధం స్వామి, రూప దంపతుల కుమారుడు యాకూబ్(12) ఆరో తరగతి చదువుతున్నారు. ఆదివారం పాఠశాలకు సెలవు కావడంతో వీరితోపాటు మరో ముగ్గురు పిల్లలు సరదాగా ఈత కొట్టేందుకు వరద కాల్వకు వెళ్లారు. నీటి గుంతలో దిగి ఈత కొడుతుండగా యాకూబ్, జంపన్న లోతుకు వెళ్లారు. ఈ క్రమంలో నీటిలో మునిగిపోయారు. గమనించిన తోటి స్నేహితులు భయంతో సాయం కోసం కేకలు వేస్తూ పరుగులు పెట్టారు. సుమారు కిలోమీటర్ దూరంలోని జీకేతండాలో నరేశ్ అనే వ్యక్తి కనిపించగా చెప్పారు. అతడు చేరుకునేసరికి యాకూబ్, జంపన్న మృతదేహాలు నీటిపై తేలి కనిపించాయి. ఘటనా స్థలాన్ని పరిశీలించిన ఎస్సై జగదీశ్ యాకూబ్ తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. కాగా, జయశంకర్ భూపాలపల్లి జిల్లా మల్హర్ మండలం తాడిచర్లకు చెందిన బొంతల రాజు, అనూష దంపతుల కుమారులు అరుణ్(12), కార్తీక్ (9) ఉదయం తల్లి అనూషతో కలిసి వారికున్న మేకలను ఊరు బయటకు మేతకు తోలుకెళ్లారు. మధ్యాహ్నం తల్లి ఇంటికి వచ్చింది. సాయంత్రం 3గంటలకు వారి ఇంటి సమీపంలోకి మేకలు వచ్చాయని చుట్టుపక్కల వారు ఆమెకు చెప్పారు. దీంతో పిల్లల కోసం వెతకగా కనిపించలేదు. పెంజరుచెరువు వద్ద చెప్పులు కనిపించాయని పలువురు చెప్పడంతో అక్కడికి వెళ్లి చూడగా తన పిల్లలవేనని గుర్తించింది. స్థానికులు వచ్చి చెరువులో గాలించి ఇద్దరి మృతదేహాలను బయటకు తీశారు. కొయ్యూర్ పోలీసులు చేరుకొని కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. కాగా, మహబూబాబాద్ మండలంలోని రెడ్యాలకు చెందిన కోర్ని రామ్మూర్తి, సౌజన్య దంపతులు కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. వారి కొడుకు సాత్విక్(5) శనివారం రాత్రి గ్రామంలోని బంధువుల ఇంట్లో ఫంక్షన్‌కు తల్లి, కొడుకు వెళ్లారు. తిరిగి ఇంటికి రోడ్డుపై నడుచుకుంటూ వస్తుండగా ఓ ట్రాక్టర్ వెనుక నుంచి వారిని ఢీకొట్టింది. దీంతో సాత్విక్ అక్కడికక్కడే మృతిచెందగా, సౌజన్యకు తీవ్రగాయాలయ్యాయి. ఆమెను చికిత్స కోసం వరంగల్‌లోని దవాఖానకు తరలించినట్లు పేర్కొన్నారు. భర్త రామ్మూర్తి పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

## అప్పుల బాధతో రైతు ఆత్మహత్య



బాలరాజు (ఫైల్)

నర్మెట, ఫిబ్రవరి 11: అప్పుల బాధతో రైతు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండల కేంద్రంలో ఆదివారం జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ముక్కెర బాలరాజు(38) తనకున్న రెండున్నర ఎకరాల వ్యవసాయ భూమిలో వరి, మక్కజొన్న సాగు చేశాడు. గత సంవత్సరం వడగండ్ల వానకు పంటలు దెబ్బతిన్నాయి. దీనికి తోడు యాసంగిలో పంటలు సాగు చేసినా ఆశించిన దిగుబడి వచ్చే అవకాశం లేకుండాపోయింది. మరోవైపు పంటలకు తెచ్చిన అప్పులను ఎలా తీర్చాలనే ఆవేదనకు గురైన బాలరాజు ఆదివారం వ్యవసాయ బావి వద్ద ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడికి భార్య, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీకాంత్‌యాదవ్ తెలిపారు.

## మేడారం భక్తులకు ట్రాఫిక్ కష్టాలు



జాకారం-పందికుంట మధ్యలో జాతీయ రహదారిపై నిలిచిన వాహనాలు

**ములుగు నుంచి మల్లంపల్లి వరకు నిలిచిన వాహనాలు**

ములుగు, ఫిబ్రవరి11(నమస్తేతెలంగాణ): మేడారం ముందస్తు మొక్కులు చెల్లించే భక్తులకు ఆదివారం ట్రాఫిక్ జామ్ కష్టాలు తలెత్తాయి. సెలవు దినం కావడంతో సుదూర ప్రాంతాల నుంచి వన దేవతలను దర్శించుకునేందుకు భక్తులు ప్రైవేటు వాహనాలు, ఆర్టీసీ బస్సుల్లో అధిక సంఖ్యలో తరలివచ్చారు. తిరుగు ప్రయాణంలో జాతీయ రహదారి వాహనాలతో రద్దీగా మారింది. ములుగు గట్టమ్మ నుంచి మల్లంపల్లి వరకు సుమారు 10 కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జామ్‌తో వాహనాలు జాతీయ రహదారిపై నిలిచిపోయాయి. ఎన్‌హెచ్ కల్వర్టు నిర్మాణ పనులు జరుగుతుండడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తింది. అక్కడ లారీ దిగబడి ఉండడం ఇందుకు కారణమైంది. దీంతో సుమారు గంట పాటు వాహనాలు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. మేడారం గ్రామంలో సైతం ట్రాఫిక్ సమస్య తలెత్తగా పోలీసులు డ్రోన్ కెమెరాను ఉపయోగించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. వాహనాలను పార్కింగ్ స్థలాలకు తరలించారు. భక్తులు కాలినడకన గద్దెలను చేరుకునేందుకు ఇబ్బందులు పడ్డారు. దీంతో పోలీసులు మేడారం నుంచి వస్తున్న వాహనాలను ములుగు మండలం జంగాలపల్లి క్రాస్, పాలంపేట-గణపురం క్రాస్ రోడ్డు నుంచి పరకాల-గుడెప్పాడ్ మీదుగా హనుమకొండ వైపునకు వాహనాలను మళ్లించారు. ఇప్పుడే ఇంత పెద్ద ఎత్తున ట్రాఫిక్ జామ్ సమస్య తలెత్తితే జాతర జరిగే నాలుగు రోజుల్లో ఎలా ఉంటుందోనని వాహనదారులు చర్చించుకుంటున్నారు.



సమ్మక్క దేవత గద్దెను దర్శించుకుంటున్న భక్తులు



## నూతనంగా ఎన్నికైన టీజీటీఏ సభ్యులు

**టీజీటీఏ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడిగా విశ్వప్రసాద్**

హనుమకొండ చౌరస్తా, ఫిబ్రవరి 11 : తెలంగాణ తహసీల్దార్స్ అసోసియేషన్(టీజీటీఏ) ఎన్నికలు ఆదివారం హనుమకొండలో జరిగాయి. ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడిగా విశ్వప్రసాద్(వరంగల్), ప్రధాన కార్యదర్శిగా అల్లం రాజ్‌కుమార్(ములుగు), కోశాధికారిగా ఎన్ విజయభాస్కర్(ములుగు), అసోసియేట్ ప్రెసిడెంట్‌గా పీ కిరణ్‌కుమార్(వరంగల్), వైస్ ప్రెసిడెంట్స్‌గా వీ విజయసాగర్(వరంగల్), రవీందర్(జనగామ), మంజుల(భూపాలపల్లి), ప్రవీణ్(హనుమకొండ), కల్చరల్ సెక్రటరీగా బీ రాజేశ్(వరంగల్), సెక్రటరీలుగా కోమి(హనుమకొండ), వెంకటస్వామి(వరంగల్), రవికుమార్(భూపాలపల్లి), చల్లా ప్రసాద్(హనుమకొండ), వినోద్(మహబూబాబాద్), ఈసీ మెంబర్స్‌గా మాధవి(హనుమకొండ), వై శ్రీనివాస్(భూపాలపల్లి), రమాదేవి ఎన్నికయ్యారు.



## తల్లులకు ముందస్తు మొక్కులు

**అమ్మవార్లను దర్శించుకున్న ఆరు లక్షల మంది భక్తులు**

తాడ్వాయి, ఫిబ్రవరి11 : మేడారం వనదేవతలకు ముందస్తు మొక్కులు చెల్లించుకునేందుకు భక్తులు భారీగా తరలివస్తున్నారు.ఆదివారం ఆరు లక్షల మంది భక్తులు దర్శించుకున్నట్లు దేవాదాయ శాఖ అధికారులు తెలిపారు. భక్తులు రాకతో మేడారం జాతర పరిసరాలు రద్దీగా మారుతున్నాయి. అమ్మవార్ల దర్శనానికి సుమారు రెండు గంటల సమయం పడుతున్నది. భక్తులకు ఇబ్బందులు కలగకుండా త్వరగా దర్శనం చేసుకుని వెళ్లేలా పోలీసులు చర్యలు చేపట్టారు. కొనుగోళ్లతో పలు రకాల దుకాణాలు సందడిగా మారాయి. జాతరకు ముందుగానే వ్యాపారం జోరుగా సాగుతుండడంతో వ్యాపారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. తాగునీరు అందించేందుకు ఎలాంటి చర్యలు చేపట్టకపోవడంతో భక్తులు రూ.50 ఒక లీటర్ వాటర్ బాటిల్‌ను కొనుక్కుని దాహం తీర్చుకోవాల్సి వస్తున్నది. అధికారులు ఈ విషయంపై దృష్టి పెట్టాలని వారు కోరుతున్నారు.



